
# నిన్ను నీవు తెలుసుకో

బి. మధుసూదనరావు



అది జరిగిన తరవాత ఇక్కడకు వచ్చాను. అంతకుముందు ఈ అడవికి దక్షిణంగా ఉన్న వూరిలో ఉండేదాన్ని.

ఆ వూరిలో ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. దాని మీద నా నివాసం.

ఆ చెట్టు ముందు ఒక కామందు మేడ ఉంది. ఆ మేడ మీద ఒక గది ఉంది. రోజులో ఎక్కువ భాగం ఆ మేడమీద గదిలో కాలం గడిపేది ఇంటి వారమ్మాయి శ్యామల.

నాతో చాలా స్నేహంగా ఉండేది శ్యామల. తను భోజనం చేసినప్పుడల్లా నాకు ఒక ముద్ద వదిలేది. ఇంట్లో ఏ పిండివంటలు చేసుకున్నా నాకు పెట్టకుండా తినేది కాదు.

ఆ బజారులో రెండిళ్ళ అవతల ఉండేవాడు రాము. తరచు శ్యామల ఇంటికి వచ్చేవాడు. డాబా ముందు ఖాళీ స్థలంలో ఇద్దరు కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. కలిసి చదువుకొనేవారు. పుస్తకాలు కొనలేక శ్యామల దగ్గర పట్టుకు వెళ్ళేవాడు రాము. ఎప్పుడూ చినిగిన బట్టలు వేసుకునే రాము ముఖంలో బీదతనం కనిపించేది.

నల్లగాను, అందవిహీనం గాను ఉండేది శ్యామల. కాని శ్యామలంటే అమితమైన ఇష్టం రాముకు. శ్యామల ముందు ఉన్నంతసేపు ఎంతో ఆనందంగా కనిపించేవాడు. వెళ్దామనిలేచి వెళ్ళలేక అలాగే నిలబడి గంటల తరబడి కబుర్లు చెప్పేవాడు. నవ్వుతూ, నవ్వించే రాము మాటలకు చాలా ఆనందించేది శ్యామల.

* * * *

ఒక రోజు మా బంధువుల్లో ఒకడు చనిపోతే మా వాళ్ళంతా కాలువ ఒడ్డున శ్మశానంలో చేరి ఒకటే శోకాలు. నేను కూడా వెళ్ళి వాళ్ళలో కలిశాను. గోల సద్దుమణిగిన తరవాత వెనక్కు వస్తూంటే దారి మధ్యలో సినిమా హాలు దగ్గర కొంతమంది ఆగిపోయారు. నేను ఆగాను.

సినిమా హాలు ముందు జనం చేరి తినే వారు తింటున్నారు. కాఫీలు, టీలు ఏది కావలసిన వారు అది తాగుతున్నారు.

అటు ఇటు చూస్తూంటే పైన పెద్ద క్లాసు వరండాలో సామాసా తింటూ కనిపించింది శ్యామల. దగ్గరకు వెళ్ళాను—గుర్తు పట్టి తను తినగా మిగిలిన ముక్క అందించింది నాకు. సంతోషంగా తిన్నాను.

ఇంతలోనే వచ్చి శ్యామలకు కాఫీ అందించాడు ఒక అందమైన అబ్బాయి. ఏం తెలియనట్లు వాళ్ళ మాటలు వినటం మొదలుపెట్టాను. ఆ అబ్బాయి పేరు కృష్ణ. మద్రాసులో సినిమా కంపెనీలో అసిస్టెంటు డైరెక్టరు. సినిమా హాల్లో వారికి పరిచయం అయింది.

మెరిసే గుడ్డలు, బూట్లు, భుజాల వరకు అందంగా దువ్విన క్రాపు—కృష్ణను చూస్తూంటే కళ్ళు తిప్పుకోలేక పోయాను.

నవ్వుకుంటూ మాట్లాడుకున్నారు. కులాసాగా కాఫీలు తాగారు. బెల్ మోగగానే హాలులోకి వెళ్ళారు.

ఇంటికి చేరాను నేను.

సాయంత్రం ఇంటికి వచ్చినప్పటి నుంచి చాలా సంతోషంగా ఉంది శ్యామల. నాకు రెండు రవ్వ లడ్లు పెట్టింది. గుప్పెడు బూంది పోసింది.

"దిష్టి తగిలేటట్లు ఇందాక ఆ అబ్బాయి వంక ఎందుకు అట్లా చూశావ్?" ముద్దుగా తిట్టింది నన్ను.

* * *

మరో రోజు జోరున వర్షం. వర్షంలో కొంచెం తడిసి తల దాచుకుందామని మేడ గది చూరుకింద చేరాను. చలికి ఆగలేక చూరు సందు నుంచి గదిలోకి దూరాను. వణుక్కుంటూ దూలం మీద కూర్చున్నాను. ఇంతలో మాటలు వినిపించాయి.

కిందకు చూస్తే మంచం మీద ఉంది శ్యామల. ఆమె పక్కనే కృష్ణ. ఫోటోలు ఉన్న కాగితాలు చూపించాడు కృష్ణ. అతను పని చేసిన డైరెక్టర్ల ఫోటోలు చూపించాడు. ఏ ఏ సినిమాల్లో అతను అసిస్టెంటు డైరెక్టరుగా పని చేసింది చెప్పాడు.

సినిమాలు అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పింది శ్యామల. సినిమాలు ఎలా తీస్తారు మొదలైన వివరాలు అడిగింది.

అన్నీ వివరాలు చెప్పాడు కృష్ణ. నటీనటులు ఎం[illegible] డబ్బు సంపాదించేది ఎంత భోగమైన జీవితం గడిపేది వివరించి చెప్పాడు

# మీ మదిలో ఒక స్వప్నమాలిక
# ఈ నవ నవలా చయనిక



| | | | |
|---|---|---|---|
| కరిగిన హరివిల్లు • | ఇంద్రగంటి జానకీబాల | నవల | 5.00 |
| విశాల ప్రపంచం | " | " | 5.00 |
| సాగరతరంగాలు • | మోచర్ల జయశ్యామల | " | 8.50 |
| వీళ్ళూ మనుషులేనా • | కె. విజయలక్ష్మి | " | 5.50 |
| నిష్కృతి | ఆర్. ప్రమీలాకుమారి | " | 6.00 |
| భ్రమర | శీలా శివరామ్ | " | 5.50 |
| తిరిగి వచ్చిన వసంతం | మల్లేశ్వరి | " | 4.00 |
| ఒక దీపం వెలిగింది | నేరెళ్ల రామలక్ష్మి | " | 5.00 |
| మేలు కలయిక | కంచర్ల కృష్ణకుమారి | " | 7.00 |
| అరుణ | డి. కామేశ్వరి | " | 9.00 |
| సజీవ స్వప్నాలు | ఆటూరి విజయలక్ష్మి | " | 8.00 |
| మాకీ భర్త వద్దు | " | కథలు | 6.00 |
| మీరు ప్రేమించలేరు | " | " | 7.00 |
| పసిడి మనసులు / పాలపాటలు • | విజయమూరి లక్ష్మి | బాలసాహిత్యం | 3.50 |

మీకు కావలసిన పుస్తకాల ఖరీదులో 1 రూపాయి తగ్గించి ముందుగా M.O. పంపితే పోస్టు ఖర్చులు మేమే భరించి ఆ 1 రూపాయికి వి.పి. పోస్టులో పంపగలము.

## నవోదయ పబ్లిషర్సు

విజయవాడ-2 • గుంటూరు-2


"నాకు సినిమాలో చేరాలని ఉంది.. నీవు ఉండా?" ఉండబట్టలేక చివరకు అడిగింది శ్యామల

"చాన్సు దొరికినప్పుడు నీ గురించి నా డైరెక్టరుకు చెపుతాను. . నేనంటే వారికి చాలా అభిమానం" అన్నాడు కృష్ణ.

బయట వర్షం కురుస్తూనే ఉంది.

చిలకాగోరింకల్లా ఏవేవో ఊసులాడుకున్నారు. ఆ గదిలో మంచం మీద జంట పక్షుల్లా గుసగుస లాడుతూ ఆ సాయంత్రం గడిపారు.

"రేపే నీకు ఫోటోలు తీయిస్తాను" వెళ్తూ చెప్పాడు కృష్ణ.

అప్పటి నుంచి తరచు వచ్చిపోయేవాడు కృష్ణ. వచ్చిన ప్రతిసారి పూటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. డాబా మీద ఖాళీ స్థలంలో కూర్చుని తుళ్ళుతూ మాట్లాడుకునే వారు. గదిలో మంచం మీద పడుకుని గిలిగింతలు పెట్టుకుంటూ నవ్వుకునే వారు.

శ్యామలకు తీయించిన ఫోటోలు తెస్తూండే వాడు. కృష్ణ శ్యామల కొరకు తను వ్రాసిన ఉత్తరాలకు మద్రాసు నుంచి వచ్చిన సమాధానాలు చదివి వినిపించేవాడు. మద్రాసు వెళ్ళి శ్యామల కొరకు తన ప్రయత్న ఫలితాలు వివరించి చెప్పేవాడు.

క్రమేపి శ్యామలకు సినిమాలో చేరాలన్న పట్టుదల ఎక్కువ అవుతూ వచ్చింది. అతను మధ్యలో నిరుత్సాహ పడినా ధైర్యం చెప్పేది అంత డబ్బు ఖర్చు వద్దనేవాడు. కృష్ణ. చాన్సు దొరికితే ఎంతైనా సంపాదించవచ్చు అని డబ్బులిచ్చి ప్రయత్నాలు చేయమని పోరేది శ్యామల.

• • •

ఒకరోజు — అప్పటికే సూర్యుడు అస్తమించి గంట అయింది. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. ఉన్నట్టుండి చెట్టుమీద కలకలం బయలుదేరింది.

చెట్టుమీదకు పాము ఒకటి చేరింది. పక్షిగుడ్లు దానికి రుచి దాని వెంట పడ్డారు నా వాళ్ళు.

చచ్చినంత భయం వేసింది నాకు. ఆ చీకటి లోనే, అలవాటైన మార్గం కాబట్టి డాబా మీదకు చేరాను.

అక్కడే ఉంది శ్యామల. పక్కన కూర్చుని ఉన్నాడు రాము. ఏదో మాట్లాడుకుంటున్నారు. నేను రామును చూచి చాలా రోజులయింది.

తనకు ఉద్యోగం దొరికిందని, ఉద్యోగం లేకనే తను ఇంతకాలం బయటకు చెప్పలేకపోయానని, శ్యామలను ప్రేమిస్తున్నానని, ఆమె ఇష్టమైతే పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు రాము.

సినిమాలో చేరే తన ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే ఫలిస్తున్నాయనీ, తనకు ఇప్పుడే పెళ్ళి ఉద్దేశం లేదని చెప్పింది శ్యామల.

"పోనీ.." నీ సుఖాన్ని, కోరేవాడు నీ శ్రేయోభిలాషి ఒకడున్నాడని గుర్తుంచుకో" అన్నాడు రాము.

"ముసలితనం వచ్చి వేషాలు దొరకనప్పుడు నీ

దగ్గరకు వస్తాను నీ ప్రేమంతా అప్పుడు చూపించు'' వెళాకోళంగా అంది శ్యామల.

చిన్నబుచ్చుకుని వెళ్ళాడు రాము.

*　　*　　*

ఒకరోజు చాలా దప్పిక అయింది నాకు. మేడ మీద గది కిటికిలో ఎప్పుడూ గ్లాసులో నీళ్ళుం టాయి. తను తాగగా మిగిలినవి ఉంచుతుందో, నాకోసమే ఉంచుతుందో మొత్తానికి కొంచెం అయినా ఉంటాయి. గ్లాసు మీద మూత దొర్లిస్తే తాగ వచ్చు.

కిటికిలో నిలబడి గ్లాసులో నీళ్ళు తాగాను.

గదిలో ఆ మూల నుంచి ఈ మూలకు, ఈ మూల నుంచి ఆ మూలకు పచార్లు చేస్తూ కనిపిం చింది శ్యామల. చేతిలో ఏదో ఫోటో ఉంది. ఏదో ఆదుర్దాగా ఉన్నట్లు కనిపించింది. అప్పటికి కృష్ణ వచ్చి వారం రోజులయింది. అతని కొరకు ఎదురు చూస్తూందని అర్థమయిందినాకు.

ఆ రోజు ఉదయమే బజారులో కనిపించాడు కృష్ణ. వెళదామనిపించి వెంట వెళ్ళి అతని ఇల్లు చూసి వచ్చాను.

శ్యామల హడావిడి చూసి ఆమెను కృష్ణ ఇంటికి ఎలాగయినా తీసుకువెళ్ళా లనుకున్నాను.

కాని ఎలా?

దగ్గరకు వెళ్ళి శ్యామల చేతిలో ఫోటో చూశాను. అది శ్యామల—కృష్ణ కలిసి తీయించుకున్న ఫోటో.

వెంటనే ఆమె చేతిలో ఫోటో లాక్కున్నాను. నా వెంటబడింది. చిక్క లేదు. డాబా మీద అటూ ఇటూ తిప్పాను. వచ్చి రోడ్డు మీద వాలాను. కిందకు దిగి రోడ్డు మీదకు వచ్చింది శ్యామల. చిక్కినట్టు ఆగి, దగ్గరకు రానిచ్చి అందకుండా దుముకుతూ కొంచెం దూరం రోడ్డు మీద గెంతు కుంటూ వెళ్ళాను. నన్ను పట్టుకోవటానికి నా వెంట నడిచింది శ్యామల. కంటికి కనిపిస్తూ, గోడల మీద వాలుతూ ముందుకు వెళ్ళాను. నా వెంట వచ్చింది శ్యామల.

చివరకు మట్టి గోడలు, తాటాకు కప్పు ఉన్న ఒక ఇంటి ముందు ఆగాను. అదే కృష్ణ ఇల్లు.

ముక్కున ఉన్న ఫోటో ఇంటి గడపకు లోపల వైపు వదిలాను. చూస్తూ గడప మీద నిలబడ్డాను.

ఫోటో కోసం లోపలకు వెళ్ళింది శ్యామల. గడప దాటి ఫోటో తీసుకుంది.

ఫోటో తీసుకుని అటు చూసింది శ్యామల. కొంచెం దూరంలో నిలబడిఉన్నాడు కృష్ణ. అతని పక్కనే పొయ్యి దగ్గిర కూర్చుని నిప్పు వైపు నోటిలో ఉండేట్లు అడ్డ చుట్ట తాగుతూంది అతని తల్లి.

శ్యామలను చూడలేదు వాళ్ళు.

''ఇందాక నర్సింహం వచ్చాడు. . . గుడ్డలు తీసుకుని నాలుగు రోజు లయిందట గదా. . . వాటి అద్దె, ఆ గుడ్డలు వెంటనే ఇయ్యా లన్నాడు'' అంటున్నది అతని తల్లి.

ఇక వినలేక పోయింది శ్యామల.

కృష్ణను అక్కడ చూడటంతోనే కళ్ళు తిరిగినంత పని అయింది శ్యామలకు. ఆ మాటలు వినటంతో కాళ్ళు వణకటం మొదలయింది.

తడబడుతూనే వెనక్కు తిరిగి రాబోయింది శ్యామల.

కృష్ణ చూశాడు. శ్యామల తనను చూచిందని, తన మాటలు విన్నదని తెలుసుకున్నాడు.

''శ్యామలా?. . . ఎలా వచ్చావ్ ఇక్కడికి?'' శ్యామల వైపు నడిచాడు కృష్ణ.

వచ్చి చేయి పట్టుకుని లోపలికి లాగాడు.

''వచ్చిన దానివి ఎటూ వచ్చావు. ఆగొలుసు కూడ ఇచ్చి పో.'' శ్యామల నోరు మూసి మెడలో చేయి వేశాడు కృష్ణ.

పిచ్చి కోపం వచ్చింది నాకు.

ఎగురుకుంటూ వెళ్ళి ముక్కుతో వాడి చేతుల మీద పొడిచాను. కాళ్ళతో వాడి ముక్కు రక్కాను.

శ్యామలను వదిలాడు కృష్ణ. బయటకు పరి గెత్తింది శ్యామల.



చిత్రం— —సత్యవాణి

గబగబా ఇంటి దారి పట్టింది శ్యామల. వెంట నేను.

గదికి వచ్చింది. కిరోసిన్ డబ్బా తెచ్చింది. అగ్గిపెట్టె తయారుగా ఉంచింది.

కాగితాలు, పెన్ను తీసి రాయటం మొదలు పెట్టింది. ఒక పేజీ నింపి పక్కన పెట్టింది.

పక్కనే చూస్తూ నిలబడ్డాను నేను.

''కృష్ణ నన్ను మోసం చేశాడే. . . నేను చచ్చి పోతున్నాను.'' నాతో చెప్పింది శ్యామల. రాయ టానికి మరో పేజీ అందుకుంది.

భయం వేసింది నాకు.

రాసి పక్కన పెట్టిన పేజీ ముక్కున కరుచు కున్నాను. ఆఘ మేఘాల మీద బయలుదేరాను.

ఏదో చదువుకుంటూ ఇంటి వరండాలో కూర్చు న్నాడు రాము. తెచ్చిన ఉత్తరం రాము ముందు విడిచాను. తిరిగి గోడ ఎక్కాను.

కాగితం తీసి చదివాడు రాము. ఉన్న ఫళంగా బయలుదేరాడు.

గదికి రాము వచ్చేసరికి ఒంటి మీద కిరోసిన్ పోసుకుంది శ్యామల. అగ్గిపుల్ల గీచింది. చీరకు అంటించుకో బోతున్నది.

''శ్యామలా?'' దగ్గరకు పరుగెత్తి వెలుగుతున్న పుల్లను పారేశాడు. చేతిలో అగ్గిపెట్టె లాగేశాడు.

''నన్ను చావనీ రామూ! నేమా మోసపోయాను . . . కృష్ణ చెప్పిన వన్నీ నమ్మి, నిజం అనుకుని దేవుడు లాంటి నిన్ను దూషించాను' బావురుమంది శ్యామల.

''చచ్చి సాధించేది ఏముంది. ఇప్పటికైనా మోసాన్ని గుర్తించావ్ అంతే చాలు. అప్పటికి ఇప్పటికి నా ప్రేమలో లోపం లేదు శ్యామలా.''

''ఉత్తరం చదివాకకూడా ఇష్టపడుతున్నావా?''

''నీ ఆస్తిని, శరీరాన్ని కాదు నేను ప్రేమించింది. కల్మషం లేని నీ మనో సౌందర్యమే నేను ఆశించింది, ఆశించేది. నీవు తప్పు చేశావనే ప్రశ్నే లేదు.''

''రామూ! నన్ను విడిచి ఎప్పటికీ వెళ్ళద్దు.'' రాము గుండెల మీద వాలింది శ్యామల.

*　　*　　*

ఒక కాకి ఒక చెట్టు మీద వాలి దొరికిన మాంసం ముక్క తింటున్నది. అది చూసింది దారిన పోతున్న నక్క.

కాకిని మురిపించి, మరిపించి ఆ మాంసం ముక్కను కాజేయాలని ఎత్తు వేసింది నక్క. ఆ కాకి చాలా చక్కగా పాడుతుందని దాన్ని పొగిడి ఒక పాట పాడమంది నక్క.

తనకు పాటలు రావని, వింటానంటే తనకు తెలిసిన ఒక కథ మాత్రం చెప్పగలనంది కాకి.

నక్క ఆశించింది కాకి నోటిలో మాంసం ముక్క. పాటా కాదు, కథా కాదు.

'సరే' అంది నక్క, కాకి నోటిలో మాంసం ముక్క జారి పడే క్షణం కొరకు ఎదురు చూస్తూ.

అప్పుడు పై కథ చెప్పింది కాకి.

*　　*　　*

కథ ముగించింది కాకి.

కాకి కథ చెప్పినంత సేపు మాంసం కోసం చెట్టు కింద వెతుకుతూనే ఉంది నక్క. జారి ఎక్కడయినా పడిందేమోనని చెట్టు చుట్టూ పరు గెత్తింది.

చెట్టు కింద ఎక్కడ మాంసం ముక్క కనపడక పైకి కిందికి మార్చి మార్చి చూసింది నక్క. తల పైకెత్తి పరీక్షగా చూసింది. కనిపించింది మాంసం ముక్క.

అందుతుందేమోనని ఎగిరి ఎగిరి పడింది నక్క.

మాంసం ముక్క కాలితో పట్టుకుని మరీ కథ చెప్పింది కాకి.

''నక్క బావా. . . పోనీ ఇప్పుడు పాడవా?'' వెక్కి రించింది కాకి.

''నోరు మూసుకో. . . నీ పాటలు నీ మిత్రుడు గాడిదకు వినిపించు.''

''చూశావా నక్క బావా. . . శ్యామల కృష్ణ మాటలు గుడ్డిగా నమ్మి మోసపోయింది. తనకు ఆ శక్తి ఉందా అని ఆలోచించ లేదు, తెలుసుకో లేదు. కాని నా లాగ చేసినట్లయితే. . . మాంసం దొరకక పోయాక నా పాట వద్దని నన్ను తిట్టావు చూశావూ అలాగే... నీవు చేయ బోయే పని చేసేవాడు కృష్ణ. . . నక్క బావా. . .'' అంటూ చుట్టూ చూసింది కాకి.

ఇంకెక్కడి నక్క బావ.

తనను తాను తెలుసుకుని తెల్ల ముఖం వేసి, మోసం బయట పడి ముఖం చెల్లక, కను చూపు మేరలో కనుపించకుండ ఒకటే పరుగు. ★